సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 20 । మార్చి । 2024



వీరందరూ కీలకం..

సార్వత్రిక ఎన్నికల పనుల్లో అధికారులు బిజీగా మారారు. ఎన్నికల నిర్వహణలో జిల్లా ఎన్నికల అధికారి నుంచి బూత్ లెవెల్ అధికారి (బీఎల్ఓ) వరకూ అందరూ కీలకమే

II లో



డెల్టాకు 8,970 క్యూసెక్కులు

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.50 అడుగుల వద్ద నీటిమట్టం కొనసాగుతోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ (సా॥)	సెహరీ గురు (ఉ॥)
రాజమహేంద్రవరం	6.23	4.46
కాకినాడ	6.23	4.46
అమలాపురం	6.23	4.46

న్యూస్‌రీల్

వార్షిక రుణ ప్రణాళిక రూ.13,201 కోట్లు



సమావేశంలో రుణప్రణాళిక డాక్యుమెంట్‌ను చూపిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు


సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి రూ.13,201 కోట్లతో జిల్లా వార్షిక రుణ ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ మాధవీలత వెల్లడించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా బ్యాంకు సమాఖ్య సమావేశంలో 2024 – 25 ఆర్థిక సంవత్సరం క్రెడిట్ ప్లాన్ విడుదల చేశారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఆయా రంగాలలో అవకాశాల మేరకు అనుబంధ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ సిద్ధం చేసి బ్యాంకర్లకు అందజేస్తున్నామన్నారు. బ్యాంకర్లు వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి రుణాలను విరివిగా అందించాలని కలెక్టర్ మాధవీలత కోరారు. నాబార్డ్ జిల్లా అధికారి డాక్టర్ వై.ఎస్. నాయుడు వివిధ బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలకు రూ.50 లక్షల సహాయం



కంబాలచెరువు (రాజమహేంద్రవరం సిటీ): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలకు హన్సా సొల్యూషన్స్ ఇంక్యుబేషన్ హబ్ ఏర్పాటుకు రూ.50 లక్షల ఆర్థిక సాయాన్ని ఆ సంస్థ చైర్మన్ రాంప్రసాద్ మంగళవారం అందజేశారు. కళాశాలలో నాలుగు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక భవనాన్ని నిర్మించి, నైపుణ్య సామర్థ్య శిక్షణకు కార్యక్రమాలు దీని ద్వారా నిర్వహించనున్నారు. విద్యార్థులకు సేఫ్టీ నాప్కిన్స్, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ, ఐటీ ఉద్యోగాలను పొందేవిధంగా శిక్షణ, ఉద్యానవన పంటలు, వ్యవసాయం, ఆరోగ్యం, పర్యాటక రంగంపై శిక్షణ ఇస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. దీనిద్వారా ప్రతి సంవత్సరం రెండు వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణను కాన్ఫిడరేషన్ ఆఫ్ విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఇస్తామన్నారు. దీనికి సీఓడబ్ల్యూఈ జాతీయ అధ్యక్షురాలు లలిత, రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీదేవి, స్థానిక అధ్యక్షురాలు రాధిక సభ్యుల సమక్షంలో ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. దాతల వల్ల ప్రభుత్వ కళాశాలలు మరింత ప్రగతి పథం వైపు నడుస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ జ్యూయలరీ తయారీలో నైపుణ్యం సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. అకడమిక్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ సంజీవ్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ అన్నపూర్ణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీశైలశాస్త్రి పాల్గొన్నారు.

సూరీడు.. మార్చ్‌పాస్ట్



- మార్చి మొదటి వారంలోనే సుర్రుమంటున్న ఎండలు
- క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- తగ్గిన చలి ప్రభావం

రాజమహేంద్రవరం రూరల్: వేసవికాలం రాకముందే భానుడు భగభగమంటున్నాడు. ఫిబ్రవరి మూడో వారం నుంచే ప్రతాపం చూపుతున్న సూరీడు మార్చి నెలలో మరింత ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. దీనికితోడు రాత్రి పూట చలి తగ్గి ఉక్కపోత పెరిగింది. జిల్లాలో మార్చి ఒకటో తేదీ నుంచి ఒక్కసారిగా 37 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. మార్చి ఉష్ణోగ్రతలు పెరిగితే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతేడాది ఇదే సమయానికి 34.7 నుంచి 35.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు ఉండేవి. అలాంటిది ఈ ఏడాది ఇదే సమయానికి 37.1 నుంచి 37.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గతేడాది కంటే ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా కురవడం కూడా ఇందుకు ఒక కారణంగా తెలుస్తోంది. దీనికితోడు వాహనాల సంఖ్య పెరిగి వాయు కాలుష్యం ఎక్కువగా ఉండటం మరో కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

▸▸ జిల్లాలో గత వారం రోజుల నుంచి ఉష్ణోగ్రత క్రమేపీ పెరగడం, గాలిలో కూడా తేమశాతం తగ్గడంతో ఉక్కపోత పెరుగుతోంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా మంగళవారం ఉష్ణోగ్రత కొంత తగ్గింది. అయితే రెండు రోజుల తరువాత ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయనే వాతావరణ నిపుణుల సూచనలతో జనం బెంబేలెత్తుతున్నారు.

▸▸ ఈ ఏడాది చలి తీవ్రత కూడా అంతంత మాత్రంగానే ఉంది. మొదట్లో కొద్ది రోజులున్నా తర్వాత దాని ప్రభావం తగ్గింది.

టోపీలకు పెరిగిన గిరాకీ

జిల్లాలో ఎండల తీవ్రత పెరగడంతో ఎండ నుంచి తప్పించుకునేందుకు టోపీలను, చిన్నపాటి గొడుగులను కొనుగోలు చేస్తున్నారు. ఇన్ని రోజులు ఎక్కడో దాచిన వీటిని బయటకు తీస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లోను, కాకినాడలోని పలు కూడళ్లలో టోపీలకు సంబంధించిన తోపుడు బండ్లు వెలిశాయి. దీంతో టోపీల వ్యాపారం ఊపందుకుంది.

మొదలైన కూలర్ల వాడకం

జిల్లాలో ఎండల తీవ్రత పెరగడంతో ఇక కూలర్లు, ఏసీలకు పని మొదలైయిందనే చెప్పాలి. చాలామంది తమ ఇళ్లలో ఉన్న ఏసీలను సర్వీసింగ్ చేయిస్తున్నారు. వీటితోపాటు ఎత్తయిన భవనాల్లో ఉండేవాళ్లు కూల్ పెయింట్లను వేయించేందుకు సిద్ధం అవుతున్నారు.

అత్యవసరమైతేనే బయటకు రండి



అనవసరంగా ఎండల్లో తిరిగి ఎవ్వరూ కష్టాలు తెచ్చుకోవద్దు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఇళ్లకే పరిమితమైతే మంచిది. వీరికి వడదెబ్బ తగిలే ప్రమాదం ఎక్కువ. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తప్పకుండా వెంట గొడుగు తీసుకెళ్లడమో లేదంటే కళ్లకు అద్దాలు, తలకు టోపీ ఉండేలా చూసుకోవాలి. ఎండాకాలంలో మంచినీరు బాగా తాగాలి. వడదెబ్బకు గురైతే సొంత వైద్యం పక్కన బెట్టి వెంటనే ప్రభుత్వాసుపత్రికి వెళ్లడం క్షేమదాయకం.

– డాక్టర్ కె.సుధాకర్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, ధవళేశ్వరం

నగరంలో వారం రోజులుగా ఉష్ణోగ్రతలు (డిగ్రీలు)

13వ తేదీ 31.23	17వ తేదీ 37.25
14వ తేదీ 34.23	18వ తేదీ 36.24
15వ తేదీ 34.24	19వ తేదీ 36.25
16వ తేదీ 35.24	

విద్యార్థులకు ఇబ్బందులు

ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభమై ముగిశాయి. ఈనెల 18వ తేదీనుంచి పదవ తరగతి, ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా ప్రారంభమయ్యాయి. 10వ తరగతి పరీక్షలు మొదలయ్యేది ఉదయమే. కాబట్టి ఎండ తీవ్రత కొద్దిగా తక్కువ ఉన్నా పరీక్ష ముగిసే సమయానికి మాత్రం అదరగొడుతోంది. ఓపెన్ స్కూల్ విద్యార్థులకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉందంటున్నారు. పరీక్షల వేళ విద్యార్థులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



ఎండ తీవ్రతకు వెలవెలబోతున్న తాడితోట వస్త్ర మార్కెట్ రోడ్డు

శరణార్థులకు రూ.2 లక్షల వితరణ



ఢిల్లీలో ఆర్థిక సహాయం అందిస్తున్న శ్రీనివాసరావు

గోకవరం: పాకిస్తాన్ నుంచి వచ్చిన హిందూ శరణార్థుల సహాయార్థం గోకవరానికి చెందిన విశ్వహిందూ పరిషత్ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు రూ.2 లక్షల సహాయం అందజేశారు. పాకిస్తాన్ నుంచి ఢిల్లీకి హిందువులు వలసలు వచ్చారని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న ఆయన ఆదివారం ఢిల్లీ వెళ్లి శరణార్థులను కలుసుకున్నారు. అనంతరం శరణార్థులకు మౌలిక వసతుల నిమిత్తం రూ.2 లక్షల సహాయం అందజేయడంతో పాటు భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన గోకవరంలో మంగళవారం మీడియా సమావేశంలో ప్రాంతీయ భేదం లేకుండా హిందువులకు ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు తమ సమితి సిద్ధంగా ఉందన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2.71 లక్షల విరాళం



దాతలకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన కూనపరాజు సూర్యావతి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పొత్తూరి సుబ్బరాజు, ఝాన్సీలక్ష్మి దంపతులు మంగళవారం రూ.2,71,000 విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు ఇచ్చారు. దాతలకు స్వామివారి చిత్ర పటం, లడ్డూ ప్రసాదాన్ని ఆలయ సిబ్బంది అందించారు.

సీఎం జగన్ మహిళా పక్షపాతి



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ తదితరులు

- మంత్రి వేణు గోపాలకృష్ణ
- 300 మంది మహిళలు వైఎస్సార్ సీపీలో చేరిక

రాజమహేంద్రవరం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు సముచిత గౌరవం కల్పిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. సంక్షేమ పథకాల ద్వారా మహిళల బ్యాంకు ఖాతాలకు నేరుగా నిధులు జమ చేస్తూ మహిళా పక్షపాతిగా నిలిచారని చెప్పారు. బొమ్మూరు బాలాజీపేట సెంటర్‌లో మంగళవారం గొందేశి మేన్షన్‌లో నగరపాలక సంస్థ 18వ డివిజన్ టీడీపీకి చెందిన సుమారు 250 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ ఇన్‌చార్జి దమ్ముప్రసాద్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీలో చేరిన షేక్‌మీరా, షేక్ షబీనా, మీసాల ప్రసాద్, కోట శ్రీను, బండి మనోజ్, నాని, పీతాశివకుమార్, రంగాల శ్రీను, నెల్లిమేరీ, కొల్లేటిపాప, అమ్ములు, మహాలక్ష్మి, తదితర మహిళలకు మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ తదితరులు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రుణమాఫీ చేస్తానని మోసం చేస్తే, సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాన్ని నాలుగేళ్లలో వైఎస్సార్ ఆసరా ద్వారా మాఫీ చేశారన్నారు. సీఎం జగన్‌పాలనలో రాష్ట్రంలో ఏ సంక్షేమ పథకం అమలు చేసిన మహిళల పేరిట అందజేస్తున్నారన్నారు. కావున ప్రతి మహిళ రాబోయే ఎన్నికలలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. రూరల్ అసెంబ్లీ అభ్యర్థిగా తనను, లోక్‌సభ అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని మంత్రి కోరారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ మంత్రి వేణుగోపాలకృష్ణ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన 50రోజుల్లోనే రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చారన్నారు. మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, వార్డు సచివాలయ కన్వీనర్ పడమట నాగమణి, పార్టీ నాయకులు చాపారాజా, కొల్లుదీపు, రాంకీ, కాటం సుస్మిత పాల్గొన్నారు.

● సీఎం జగన్‌ను కలిసిన మంత్రి వేణు, ఎమ్మెల్యే రాజా



రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు శ్రీఘాకోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం, ఏపీ స్టేట్ చాంబర్ ఆఫ్ కామర్స్ స్టేట్ కన్వీనర్ నందెపు శ్రీనివాస్, పార్టీ నాయకులు ఆదపా అనిల్, బి.సురేష్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి శాలువా కప్పి ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతులు తీసుకోవాలి

- సువిధా పోర్టల్‌పై అవగాహన
- వివరాలను వెల్లడించిన కలెక్టర్ మాధవీలత

SUVIDHA

సువిధా పోర్టల్ యాప్

అనుమతి ఇచ్చే అంశాలు

- తాత్కాలిక పార్టీ కార్యాలయాన్ని తెరవడానికి
- సభ నిర్వహించడానికి అనుమతి, లౌడ్ స్పీకర్ లేకుండా సభ నిర్వహించడానికి
- లౌడ్ స్పీకర్ ఏర్పాటు చేయడం కోసం
- స్ట్రీట్ కార్నర్ మీటింగ్, లౌడ్ స్పీకర్ కోసం
- ఇంటింటికీ ప్రచారం
- కరపత్రాల పంపిణీ
- ఊరేగింపు కోసం
- ర్యాలీలో లౌడ్ స్పీకర్
- జెండాలను ప్రదర్శించడానికి
- ఎయిర్ బెలూన్‌ల ప్రదర్శన
- హెలికాప్టర్, హెలిప్యాడ్ కోసం
- వాహన అనుమతికి
- వీడియో వ్యాన్ వినియోగం కోసం, అభ్యర్థి కోసం పూర్తి అసెంబ్లీ ప్రాంతానికి ఒక వాహనం కోసం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సార్వత్రిక ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో సువిధా పోర్టల్ ద్వారా తప్పకుండా అనుమతులు తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత తెలియజేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులకు సువిధా, ఎంసీసీ, పీఓ, ఏపీఓ, ఓపీఓల శిక్షణ కార్యక్రమం, పోస్టల్ బ్యాలెట్, తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సువిధా పోర్టల్ కోసం పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సువిధా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు. రాజకీయ పార్టీలు, పోటీలో ఉండే అభ్యర్థులు ముందస్తుగా సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సువిధా పోర్టల్‌లో నేరుగా దరఖాస్తు చేసుకుంటే ఆర్ఓలు సాధ్యమైనంత త్వరగా అనుమతులు జారీ చేస్తారన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకునే సౌలభ్యం ఉందన్నారు. జేసీ తేజ్‌భరత్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ ఎన్నికల స్పెషల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

మెట్టలో వరి కోతలు మొదలు

- దిగుబడి ఎకరాకు 50 బస్తాల పైనే
- జిల్లాలో 4.26 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- యంత్రాలతో ముమ్మరంగా జరుగుతున్న ఖైనం
- బస్తా ధర రూ. 1,750

రాజానగరం: ఆరుగాలం శ్రమించి పండించే పంటలకు మార్కెట్‌లో సరైన ధర పలికితే రైతన్నల ఆనందానికి అవధులు ఉండవు. సాగులో పడిన కష్టాన్నంతా మరచిపోతారు. ప్రస్తుతం జిల్లాలోని మెట్ట రైతాంగం ఇదే ఆనందంతో ఉంది. జిల్లాలోని మెట్ట ప్రాంతంలోని కొన్ని గ్రామాలలో రబీ వరి పంట కోతలు ప్రారంభమై, ఆశించిన దిగుబడులు వస్తున్నాయి.



యంత్రాలతో సాగుతున్న వరి పంట కోతలు

నాలుగు రోజులుగా జోరుగా..

సాగు నీటి సదుపాయాలు సమృద్ధిగా లేని మెట్ట ప్రాంతంలో రైతులు భూగర్భ జలాలనే నమ్ముకుని వ్యవసాయం చేస్తుంటారు. అయినాగాని సమయానుకూలంగా సాగు చేస్తూ, జిల్లాలో అందరికంటే ముందుగానే నాట్లు వేయడంతో కోతలు కూడా ముందుగానే వస్తుంటాయి. ప్రస్తుత రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంట జిల్లాలో వెన్నులేస్తూ, గింజలు పాలుపోసుకుంటున్న తరుణంలో మెట్ట ప్రాంతంలో మాత్రం ఏకంగా వరి పంట కోతలే ప్రారంభమయ్యాయి. చాగల్నాడు ప్రాంతంగా పిలిచే రాజానగరం మండలంలోని నరేంద్రపురం, తూర్పుగానుగూడెం, కలవచర్ల, రాజానగరం, వెలుగుబంద, గండేపల్లి మండలం మురారి, గండేపల్లి, వడిశలేరు ప్రాంతాలలో యంత్రాల సాయంతో వరి పంట కోతలు నాలుగు రోజులుగా ముమ్మరంగా జరుగుతున్నాయి.

90 రోజుల్లోనే కోతకు వచ్చే ఆర్ఎస్ఆర్ వరి వంగడం

జిల్లాలోని 19 మండలాల్లో 59,348 హెక్టార్లలో రబీ సీజన్‌లో వరి పంట సాగు జరిగింది. దీనిలో మెట్ట ప్రాంతంలో 15,685 హెక్టార్లు వరకు ఉండగా, ఎక్కువ శాతం మంది రైతులు ఆర్ఎస్ఆర్–15048 వరి వంగడాన్ని సాగు చేశారు. సన్న రకానికి చెందిన ఈ వంగడం 90 రోజుల వ్యవధిలోనే కోత వచ్చేస్తుంటడంతో ఈ ప్రాంతంలో అందరికంటే ముందుగా వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. పెద్దగా తెగుళ్ల బెడద లేకపోవడంతో ఎకరాకు 50 బస్తాలు పైబడి దిగుబడులు వస్తాయి. 75 కిలోల బస్తా రూ. 1,750లు పలుకుతున్న నేపథ్యంలో అన్నదాతలు వరి పంట కోతలను ముమ్మరం చేశారు. కోతలు ప్రారంభించిన నాలుగు రోజుల క్రితం బస్తా ధాన్యం ధర రూ.1,850 పలికింది. పంట కోతలు ముమ్మరంగా జరుగుతున్న ప్రస్తుత పరిస్థితులలో ఆ ధర రూ.1,750గా ఉంది. ఇది మరో రూ.వంద తగ్గవచ్చనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వరి పంట కోతల వేగం పెరిగింది. బయట వ్యాపారులు పొలాలల్లోకి వచ్చి, యంత్రం నుంచి కోసిన పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. దీంతో కోతలు చేపట్టిన వెంటనే ధాన్యం విక్రయాలు కూడా జరిగిపోతుండటంతో కర్షకుల మోములు చిద్విలాసంతో కళకళలాడుతున్నాయి.

50 బస్తాల దిగుబడి వస్తుంది



ప్రస్తుతం జరుగుతున్న వరి కోతలలో ఎకరాకు 50 బస్తాలకు పైగానే దిగుబడులు వస్తున్నాయి. మార్కెట్ ధర కూడా బస్తా రూ.1,750 పలుకుతోంది. సన్న రకాలలో ఒకటైన ఆర్ఎస్ఆర్ – 15048 వంగడాన్నే ఈ ప్రాంతంలో ఎక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం అవే కోతకు వస్తున్నాయి. అయితే గత రబీ కంటే ధాన్యం ధర పెరగకపోయినా ఖర్చులు మాత్రం పెరిగాయి. గత రబీలో ఎకరాకు రూ.38 వేల వరకు ఖర్చు అయితే ఈసారి రూ.42 వేలకు పైగానే ఖర్చు అయింది. యంత్రాలతో కోతలు కోసినందుకుగాను గంటకు రూ.2,500 చెల్లించవలసి వస్తోంది. ఆహారానికి సన్న రకాలు మంచివే అయినాగాని నిల్వ చేసుకోవడానికి వీలులేకుండా ఉంది. కోతలు కోసిన తరువాత ధాన్యాన్ని ఆరబెట్టాలి. అందుకు అనువుగా కళ్లాలు ఉండాలి. మార్కెట్ యార్డులు అటువంటి సదుపాయాలు కల్పిస్తే బాగుంటుంది.

– పాలచర్ల వెంకటరమణ, రైతు, మురారి

4.26 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా



జిల్లాలో రబీ వరి పంట దిగుబడి 4 లక్షల 26 వేల మెట్రిక్ టన్నుల వరకు ఉంటుందని అంచనా. ప్రస్తుతం రాజానగరం మండలంలో నరేంద్రపురం, కలవచర్ల, తూర్పుగానుగూడెం, రాజానగరంలలో వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. సన్న రకంగా ఉన్న ఆర్ఎస్ఆర్– 15048 వరి వంగడాన్ని సాగు చేసిన పొలాలలోనే ప్రస్తుతం వరి పంట కోతలు జరుగుతున్నాయి. ఈ వరి వంగడం ద్వారా 32.5 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని భావిస్తున్నాం. ఇతర మండలాలలో బొండాలు 3626, ఎంటీయు 1121 వంటి వంగడాలను సాగు చేశారు.

– ఎస్. మాధవరావు, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

బాలికపై ఆటోడ్రైవర్ లైంగిక దాడి

గండేపల్లి: బాలికపై ఓ ఆటోడ్రైవర్ లైంగిక దాడికి పాల్పడిన సంఘటన ఇది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనపై గండేపల్లి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై ఎస్.రామకృష్ణ వివరాల మేరకు, గండేపల్లి గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదేళ్ల బాలిక చదువుతోంది. అదే పాఠశాలకు ఆటోపై బాలికతో పాటు మరికొందరు వెళ్లి వస్తుంటారు. ఇలాఉండగా శనివారం పాఠశాల నుంచి ఇంటికి వచ్చే సమయంలో, దారిమధ్యలో బాలిక ఒంటరిగా ఉండగా.. ఆటోడ్రైవర్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇంటికి చేరుకున్న బాలిక ద్వారా విషయం తెలుసుకున్న ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు బాలికను వైద్య పరీక్షల కోసం జగ్గంపేట ప్రభుత్వాస్పత్రికి పంపించారు. పోక్సో యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు. దిశా డీఎస్పీ ఆర్.రామచంద్రరావు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

విద్యార్థిని అదృశ్యం

సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ మంగళవారం తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఒక కళాశాలలో ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాలిక సోమవారం ఉదయం పరీక్ష రాయడానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రబీ సాగునీటికి ఇబ్బందులు లేవు


సతీష్ కుమార్, సీఈ

ధవళేశ్వరం: రబీ పంటకు నీటి విడుదలలో ఎటువంటి ఇబ్బందులు లేవని గోదావరి డెల్టా సిస్టం సీఈ ఆర్.సతీష్ కుమార్ తెలిపారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో పూర్తి స్థాయిలో సాగునీటిని విడుదల చేస్తున్నామన్నారు. గోదావరిలో నీటి లభ్యత ప్రస్తుతం సమృద్ధిగా ఉందన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉంటే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ 94907 41146 నంబర్‌కు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఇరిగేషన్ ఏలూరు సర్కిల్ ఎస్ఈ 96525 36333 నంబర్‌కు తెలియజేయాలన్నారు.

ఎన్నికల సమరం.. వీరందరూ కీలకం

- ప్రత్యేకంగా అధికారుల నియామకం
- ఒక్కొక్కరికీ ఒక్కో బాధ్యత

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల వేడి మొదలైంది. ఇప్పటికే అధికారులు ఎన్నికల పనుల్లో బిజీగా మారారు. ఎన్నికల నిర్వహణలో జిల్లా ఎన్నికల అధికారి నుంచి బూత్ లెవెల్ అధికారి (బీఎల్ఓ) వరకూ అందరూ కీలకమే. నామినేషన్ల స్వీకరణ నుంచి ఫలితాలు వెల్లడించే వరకూ ప్రతి విషయంలో అధికారుల పాత్ర ఉంటుంది. ఎన్నికల నిర్వహణకు ఎంతమంది అధికారులు ఉంటారు, వారి బాధ్యతలు ఏమిటో తెలుసుకుందాం.

ప్రధాన ఎన్నికల అధికారి

రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణకు కేంద్ర ఎన్నికల సంఘం సంబంధిత రాష్ట్రాన్ని సంప్రదించి అధికారిని నియమిస్తుంది. రాష్ట్రంలో ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకునే అధికారం ప్రధాన ఎన్నికల అధికారికి ఉంటుంది.

జిల్లా ఎన్నికల అధికారి

ఏ జిల్లా కలెక్టర్ అక్కడ జిల్లా ఎన్నికల అధికారిగా ఉంటారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియామావళిని అమలు చేస్తూ, ఎన్నికలు ప్రశాంతంగా జరిపించడంలో కీలక పాత్ర పోషిస్తారు.

రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ)

శాసనసభ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రతి నియోజకవర్గానికీ ఒక రిటర్నింగ్ అధికారి నియమిస్తుంది. వీరు నియోజకవర్గంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, తుది జాబితా తయారు చేస్తారు. పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహించే సిబ్బంది నియామకాలు, వారికి శిక్షణ, ఓట్లు లెక్కింపు, ఫలితాల ప్రకటన వంటి విధులను ఆర్ఓ నిర్వహిస్తారు.



ఏఆర్ఓ

నియోజకవర్గస్థాయిలో ఆర్ఓకు సహాయకారిగా డిప్యూటీ కలెక్టర్, మండల తహసీల్దార్లు ఏఆర్‌వోలుగా వ్యవహరిస్తారు. ఆర్ఓ చేపట్టే బాధ్యతలను వీరు పంచుకుంటారు. ఆర్ఓకు అన్ని విధాలా సహాయం చేస్తూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి తోడ్పడతారు.

ప్రిసైడింగ్ అధికారి

ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఆయన పోలింగ్‌కు అవసరమైన ఈవీఎంలు, వీవీప్యాట్‌లను బూత్‌కు తీసుకువస్తారు. పోలింగ్ అనంతరం సీల్ వేసి స్ట్రాంగ్‌రూంకు తరలిస్తారు. ఇతడికి మరో అధికారి ఏపీఓ ఉంటారు. పోలింగ్ కేంద్రాల్లో జరిగే అన్ని కార్యకలాపాలు ఈయన పర్యవేక్షణలోనే జరుగుతాయి.

సెక్టోరల్ అధికారి

ఎనిమిది నుంచి పది పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించేందుకు ఒక సెక్టోరల్ అధికారి ఉంటారు. మండలంలో వివిధ శాఖల్లో పనిచేసే గెజిటెడ్ అధికారులు ఈ బాధ్యతలు చూసుకుంటారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు, అవసరమైన చోట 144 సెక్షన్ విధించే అధికారం సెక్టోరల్ అధికారికి ఉంటుంది. **సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ బూత్‌ల గురించి, అక్కడ బందోబస్తుకు సిఫారసు చేయడం వంటి విధులు నిర్వహిస్తారు.**

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

నియోజకవర్గంలో మండలానికి మూడు చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఉంటాయి. ఆయా మండలాల్లో మద్యం, డబ్బు, ఓటర్లను ప్రలోభపరిచేందుకు తరలించే సామగ్రి అక్రమ రవాణా జరగకుండా వీరు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తారు.

మైక్రో అబ్జర్వర్లు

ఎన్నికలు జరిగే తీరుపై నివేదిక రూపొందించి జిల్లా, రాష్ట్ర ఎన్నికల అధికారులకు పంపించడంలో మైక్రో అబ్జర్వర్లు కీలకంగా వ్యవహరిస్తారు.

బీఎల్ఓలు

కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి దరఖాస్తులను అందజేయడం, ఓటర్లను తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడడం బీఎల్ఓల బాధ్యత. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల గురించి ఉన్నతాధికారులకు తెలియజేయడం, ఓటరు జాబితా ప్రదర్శన, పోలింగ్ కేంద్రాల మార్పు తదితర సేవలను అందిస్తారు.

ఓటు నమోదు అధికారి

ఓటర్ల జాబితాను తయారు చేయడం ఈ అధికారి బాధ్యత. ఓటు నమోదు చేసుకొనేవారు, జాబితాలో పేర్లు తప్పుగా ఉన్నవారు ఈ అధికారిని సంప్రదిస్తే తగిన చర్యలు తీసుకుంటారు. వీరి పర్యవేక్షణలో కొందరు సిబ్బంది పనిచేస్తారు.

విద్యుత్ నిఘా శాఖ దాడులు

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ యాంటీపవర్ థెఫ్ట్ స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ ఎ.నాగమోహన్‌రెడ్డి హెచ్చరించారు. గొల్లపాలెం మండలం ఆర్యావటం గ్రామంలో ఆక్వా చెరువులను మంగళవారం తనిఖీ చేశారు. అక్కడ మీటరు బైపాస్ చేసి విద్యుత్ చౌర్యం చేస్తున్నట్లు గుర్తించారు. సదరు ఆక్వా చెరువుల యజమానికి రూ.1,07,255 అపరాధ రుసుంతో పాటు రూ.20 వేలు జరిమానా విధించారు.

స్కూల్ బస్సు ఢీకొని బాలిక మృతి


ప్రమాదానికి కారణమైన బస్సు, డ్రైవర్

రాజానగరం: మద్యం మత్తులో నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపిన ఓ ప్రైవేటు స్కూలు బస్సు డ్రైవర్ నాలుగేళ్ల చిన్నారిని బలిగొన్నాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పాలచర్ల గ్రామానికి చెందిన సురేష్, సుబ్బలక్ష్మి వ్యవసాయ కూలీలు. వీరికి ఇద్దరు అమ్మాయిలు సంతానం. పెద్దమ్మాయి శ్రీవల్లి (4) అదే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళుతోంది. శ్రీవల్లి మంగళవారం మధ్యాహ్నం మరో ముగ్గురు చిన్నారులతో కలిసి ఆయా సాయంతో టాయిలెట్ కోసం అంగన్‌వాడీ కేంద్రం నుంచి బయటకు వచ్చింది. తనతో వచ్చిన ముగ్గురు చిన్నారులు పరుగున రోడ్డు దాటడంతో వెనుక ఆయాతో వస్తున్న శ్రీవల్లి కూడా రోడ్డు దాటేందుకు పరుగు తీసింది. అదే సమయంలో అటుగా వేగంగా వచ్చిన యంగ్ చాంప్ స్కూల్ బస్సు ఆ చిన్నారి చెంపను రాసుకుంటూ దూసుకుపోయింది. తీవ్ర గాయమై రక్తం కారుతున్న ఆ చిన్నారిని చూసి ఆయా స్పృహ తప్పి పడిపోయింది. ఆ చిన్నారిని వెంటనే చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. డ్రైవర్ మద్యం మత్తులో బస్సును వేగంగా నడపడం వలనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- నల్లజర్లలో ఘటన


సుకేష్ (ఫైల్)

నల్లజర్ల: జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం డివైడర్‌ను బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రగాయాల పాలయ్యారు. వివరాల్లోకి వెళితే.. కృష్ణాజిల్లా కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామానికి చెందిన మారంపల్లి సుకేష్, కటిక సువర్ణరాజు, ఈశ్వర్ స్నేహితులు. ఈ ముగ్గురూ ఎలక్ట్రికల్ వైరింగ్ పనులు చేస్తూ, ఖాళీ సమయాలలో కేటరింగ్‌కు వెళుతుంటారు. వీరిలో సువర్ణరాజు తమ్ముడు సురేష్ రాజమహేంద్రవరంలో ఉంటున్నాడు. ఇక్కడ ఎలక్ట్రికల్


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పనులు బాగున్నాయని చెప్పడంతో ఆ ముగ్గురూ స్నేహితులు రాజమహేంద్రవరం బైక్‌పై బయలుదేరారు. మంగళవారం ఉదయం నల్లజర్లలో ఫ్లై ఓవర్‌పై అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న సుకేష్ (18) అక్కడికక్కడే మృతి చెందాడు. సువర్ణరాజు, ఈశ్వర్ తీవ్ర గాయాలతో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఈశ్వర్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఏఎస్సై శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య, అత్తామామలపై అల్లుడి దాడి

రాయవరం: మండలంలోని లొల్ల గ్రామంలో భార్య, అత్తామామలపై అల్లుడు దాడి చేశాడు. వివరాల్లోకి వెళితే.. లొల్ల గ్రామానికి చెందిన రవ్వా వెంకన్న, లక్ష్మీనారాయణమ్మల కుమార్తె ధనమ్మను వెదురుపాకకు చెందిన మేడపాటి చంద్రశేఖర్‌కు ఇచ్చి 2016 నవంబర్‌లో వివాహం చేశారు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. డ్రైవర్‌గా పనిచేసే చంద్రశేఖర్ రెండేళ్లుగా ఇంటి వద్దనే ఖాళీగా ఉంటున్నారు. పైగా భార్య ధనమ్మను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. అతడి వేధింపులను భరించలేని ధనమ్మ పుట్టింటికి వచ్చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల ఆరో తేదీన చంద్రశేఖర్ లొల్లలోని అత్తగారింటికి వచ్చి, తన భార్యను ఇంటికి ఎందుకు పంపించడం లేదంటూ అత్త లక్ష్మీనారాయణమ్మపై ఇనుప రాడ్డుతో దాడి చేశాడు. అడ్డు వచ్చిన భార్య ధనమ్మ, మావయ్య వెంకన్నలపై కూడా దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. ధనమ్మ, ఆమె



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ధనమ్మ, లక్ష్మీనారాయణమ్మ

తల్లి లక్ష్మీనారాయణమ్మ రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా.. అల్లుడు చంద్రశేఖర్ తమకు ఫోన్ చేసి భయపెడుతున్నాడని, అతడి నుంచి తమకు ప్రాణహాని ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎస్సై జి.నరేష్‌ను వివరణ కోరగా.. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌కు ఏడేళ్ల జైలు

- ప్రేమ పేరుతో యువతికి ద్రోహం
- తీర్పు వెల్లడించిన న్యాయమూర్తి

అమలాపురం టౌన్: ప్రేమ పేరుతో ఓ యువతికి దగ్గరై, అనంతరం ప్రభుత్వ ఉద్యోగం రాగానే వేరే పెళ్లికి సిద్ధపడిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌కు ఏడేళ్ల జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం ఎనిమిదో ఏడీజే కోర్టు (క్రైమ్ వుమెన్ ఎగైనెస్ట్) న్యాయమూర్తి వై.బెన్నయ్యనాయుడు మంగళవారం తీర్పు చెప్పారు. అమలాపురం పట్టణ సీఐ కె.క్రిస్టోఫర్ తెలిపిన వివరాల ప్రకారం.. అమలాపురం రూరల్ మండలం పేరూరు గ్రామానికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన పరమట వెంకటేశ్వర దొరబాబు ప్రేమ పేరుతో నమ్మించాడు. శారీరకంగా దగ్గరయ్యాడు. అదే సమయంలో దొరబాబుకు సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. దీంతో ప్రేమించిన యువతిని కదని, కట్నం కోసం వేరే అమ్మాయిని పెళ్లి చేసుకునేందుకు సిద్ధపడ్డాడు. దీంతో బాధిత యువతి 2019 జనవరి 17న అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో దొరబాబు, అతడి కుటుంబీకులపై ఫిర్యాదు చేసింది. అప్పటి పట్టణ సీఐ జి.సురేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దొరబాబును అప్పట్లో సీఆర్‌పీఎఫ్ నుంచి అనుమతి తీసుకుని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించింది. ఈ కేసుకు సంబంధించి కోర్టులో మంగళవారం జరిగిన తుది విచారణలో దొరబాబు నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. అడిషనల్ పీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. కేసు దర్యాప్తును పకడ్బందీగా చేసిన అప్పటి పట్టణ సీఐలు సీహెచ్.శ్రీరామ కోటేశ్వరరావు, జి.సురేష్‌బాబు, కోర్టు కానిస్టేబుల్ జి.సురేష్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ సునరాపు శ్రీధర్ అభినందించారు.

సూక్ష్మ సేద్యంతో అధిక దిగుబడులు

- 3 వేల హెక్టార్లలో అమలు చేయడమే లక్ష్యం
- మైక్రో ఇరిగేషన్ పీడీ దుర్గేష్


బిందు సేద్యాన్ని పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్

నల్లజర్ల: సూక్ష్మ సేద్యంతో అధిక దిగుబడులు సాధించడమే కాకుండా విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చని జిల్లా మైక్రో ఇరిగేషన్ పీడీ దుర్గేష్ తెలిపారు. నల్లజర్ల మండలంలో మైక్రో ఇరిగేషన్ అమలు చేసిన ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం నల్లజర్ల ఉద్యాన శాఖ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా పరిధి 19 మండలాల్లోని 3 వేల హెక్టార్లలో ఈ ఏడాది మైక్రో ఇరిగేషన్ అమలు చేయాల్సి ఉండగా, ఇంతవరకూ 2,218 హెక్టార్లలో పూర్తయినట్టు చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా దరఖాస్తులను ప్రస్తుతం స్వీకరించడం లేదన్నారు. ఐదు ఎకరాల లోపు పొలం ఉన్న రైతులకు డ్రిప్ విధానంలో 90 శాతం, ఐదు ఎకరాలకు పైన ఉన్న వారికి 70 శాతం, పది ఎకరాలు దాటిన రైతులకు 50 శాతం సబ్సిడీగా అందిస్తున్నట్టు చెప్పారు. అన్ని రకాల ఉద్యాన పంటలకు బిందుసేద్యం వినియోగించుకోవచ్చన్నారు. కూరగాయలు, అరటి, పత్తి, వేరుశెనగ పంటలలో స్ప్రింక్లర్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

70 శాతం నీటి ఆదా

దుర్గేష్ మాట్లాడుతూ బిందుసేద్యం ద్వారా 70 శాతం నీటిని ఆదా చేయవచ్చని, ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు చేసుకోవచ్చన్నారు. అన్ని మొక్కలకు సమంగా నీరు సరఫరా కావడం వల్ల మొలక శాతం, పంట పెరుగుదల బాగుంటుందని తెలిపారు. కలుపు సమస్య తగ్గుతుందన్నారు. నీటి ద్వారా ఎరువులు పంపడం వల్ల పంట పెరుగుదలకు అనుగుణంగా పోషకాల సరఫరా జరుగుతుందన్నారు. ఏక కాలంలో పంటకోతకు వస్తుందని, 40 శాతం విద్యుత్ ఆదా, 40 శాతం కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. నాణ్యమైన ఉత్పత్తి రావడంతో పాటు ఎకరాకు 20 నుంచి 30 శాతం దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ ఏడాది ఇంతవరకూ రూ.20 కోట్లు సబ్సిడీగా అందించినట్టు తెలిపారు. ఆయన వెంట మండల ఉద్యానశాఖాధికారి బబిత, ఉద్యాన సహాయకులు ఉన్నారు.

సోమేశ్వరంలో పెట్రోల్ బంక్ సీజ్

రాయవరం: సోమేశ్వరంలోని శ్రీ వీర వెంకట సత్యనారాయణ సామిల్ - ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ పెట్రోల్ బంక్‌ను విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. నయారా ఎనర్జీ లిమిటెడ్ ఫ్రాంచైజీతో ఒప్పందాన్ని రద్దు చేసుకున్న తరువాత కూడా (నయరా గతంలో ఈసర్ పేరుతో) డీలర్ స్టాక్‌ను విక్రయిస్తున్నాడు. సదరు నయారా ఎనర్జీ లిమిటెడ్ ఫ్రాంచైజీ రద్దు విషయం జాయింట్ కలెక్టర్‌కు తెలియజేయలేదు. కాగా.. పెట్రోల్ బంక్‌లో ఎయిర్ మెషీన్ పనిచేయడం లేదు. అగ్నిమాపక పరికరాలను రీఫిల్ చేయలేదు. సివిల్ సప్లయిస్ అధికారులు బంక్ నుంచి రెండు నమూనాలు సేకరించారు. నయారా ఎనర్జీ లిమిటెడ్ ఫ్రాంచైజీతో ఒప్పందాన్ని రద్దు చేసుకున్న తరువాత కూడా డీలర్ స్టాక్‌ను విక్రయిస్తున్న కారణంగా, స్టాక్ రిజిస్టర్ నిర్వహించకపోవడంతో రాయవరం సివిల్ సప్లయిస్ అధికారులు సుమారు రూ.5,07,715 విలువైన 3,158 లీటర్ల పెట్రోలు, 1,686 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. బంక్ యాజమాన్యంపై 6 ఏ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పెట్రోల్ బంకుల యాజమాన్యాలు నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో విజిలెన్స్ అధికారులు ముత్యాలు నాయుడు, నాగ వెంకటరాజు, విజయకుమార్, సీఎస్‌డీటీ అలీషా పాల్గొన్నారు.


సోమేశ్వరంలో పెట్రోల్ బంక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

రాజానగరం: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని నరేంద్రపురంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన మద్దూరి శ్రీను (45) పంటకోత మెషీన్‌ను వాయిదాలపై కొనుగోలు చేశాడు. అయితే ఆ వాయిదాలను సకాలంలో చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మనోహర్ తెలిపారు.

నరసన్న కల్యాణోత్సవాలకు శ్రీకారం


పుట్టమన్ను సేకరణ సందర్భంగా పూజలు చేస్తున్న పండితులు, అర్చకులు

మధురపూడి: కోరుకొండలో కొలువైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దత్తత దేవస్థానమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. మొదటిరోజు స్థానిక దేవుని కోనేరు సమీపంలోని జమ్మిచెట్టు నుంచి పుట్టమన్ను సేకరించారు. అంకురార్పణ, ధ్వజారోహణ, గ్రామ బలిహరణ, సేవాకాలం జరిగింది. దేవస్థానం అనువంశిక ధర్మకర్త పరాశర రంగరాజ బట్టర్, అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ ఎ.సూర్యనారాయణ, పాణింగపల్లి పవన్ కుమార్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు. కాగా.. బుధవారం మధ్యాహ్నం 1.58 గంటలకు స్వామివారి రథోత్సవం ప్రారంభమవుతుంది. రాత్రి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.

గంజాయి పట్టివేత

రాజమహేంద్రవరం రూరల్: ఏపీహెచ్‌బీ కాలనీ ఏడెకరాల లేఅవుట్‌లో మంగళవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు మహిళలను బొమ్మూరు ఎస్సై బి.శ్రీను, మహిళా సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. వారి నుంచి 5.150 కిలోల గంజాయితో పాటు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారిని బాబానగర్‌కు చెందిన కొండేటి కనక మహాలక్ష్మి, సుబ్బారావు నగర్‌కు చెందిన టేకి భవానిగా గుర్తించారు. నర్సీపట్నం నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్టు విచారణలో తేలింది. గంజాయి విలువ రూ.25,750 ఉంటుందని ఎస్సై బి.శ్రీను తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

గంజాయి, రెండు బైక్‌ల స్వాధీనం

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం–తొత్తరమూడి వద్ద మంగళవారం గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై బి.రాజేష్ కుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం శానపల్లిలంక గ్రామానికి చెందిన పెయ్యల భరద్వాజ్, కాకినాడ ఇంద్రపాలెంకు చెందిన దవల స్వరూప్, గుంటూరు కృష్ణరాజు అనే ముగ్గురు మండలంలోని ముక్తేశ్వరం, తొత్తరమూడి తొగరపాయ వంతెన వద్ద అయిదున్నర కేజీలు గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా తన సిబ్బందితో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. గంజాయి, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

భిన్న ఉపాధి

తొలి మహిళా షిప్ సర్వేయర్



స్త్రీలు సముద్రయానంలో పని చేయడానికి వెనుకాడతారు. సముద్రం మీదకు వెళ్లడానికి ధైర్యమున్నా కుటుంబాలు అంగీకరించవు. కాని పూజా ఛతోత్ దేశంలో మొదటి మహిళా షిప్ సర్వేయర్ కాగలిగింది. ఒక షిప్ తయారీ మొదలైనప్పటి నుంచీ అది సముద్రం మీద చేసే ప్రయాణం వరకూ అన్ని ప్రమాణాలు పాటించేలా చూసే ఉద్యోగమే షిప్ సర్వేయర్. పూజా ఛతోత్ పరిచయం.

భారీ నౌక ప్రయాణిస్తూ ఉంటుంది. కనుచూపు మేరా నీలి రంగు సముద్రం తప్ప వేరే ఏమీ ఉండదు. ఉప్పునీటి గాలులు ముఖాన తాకుతుంటాయి. ఆ నౌక సముద్రయానానికి సురక్షితం అనే ఆమోదం తెలిపిన షిప్ సర్వేయర్ డెక్ మీద నిలబడి డ్యూటీ సమర్థంగా చేస్తున్నాననే తృప్తితో చిరునవ్వు చిందిస్తూ ఉంటే ఎలా ఉంటుంది? పూజా ఛతోత్‌ను అడగాలి.

ఆమె ఇప్పుడు బ్రిటన్‌కు చెందిన ప్రఖ్యాత సముద్రయాన సంస్థ ‘లాయెడ్స్ రిజిస్టర్’లో షిప్ సర్వేయర్‌గా పని చేస్తోంది. ఇతర దేశాలలో షిప్ సర్వేయర్లుగా మహిళలు ఇదివరకే పని చేస్తున్నా మన దేశంలో పూజా ఛతోత్ మాత్రమే తొలి మహిళా సర్వేయర్ కాగలిగింది.

చిన్నప్పటి ప్రభావం

పూజా ఛతోత్‌ది కేరళలోని కన్నూర్ జిల్లా. అక్కడి ‘ఎజిమల’ అనే చోట ఆసియాలోనే అతి పెద్దదైన భారత నావెల్ అకాడెమీ ఉంది. నావెల్ కేడెట్‌ల శిక్షణ అక్కడే జరుగుతుంది. బాల్యంలో తల్లిదండ్రులతో కలిసి అకాడెమీని సందర్శించిన పూజా శిక్షణలో ఉన్న నావెల్ కేడెట్‌లను చూసి స్ఫూర్తి పొందింది. ముఖ్యంగా చాలామంది పురుష కేడెట్‌ల మధ్య ఒకే ఒక మహిళా ఆఫీసర్‌ను చూసింది పూజ. అప్పుడే ఆ ఆఫీసర్‌లాగానే తానూ సముద్రం మీద పని చేసే ఉద్యోగం చేయాలని అనుకుంది. ‘నేను హైస్కూల్ చదువుతున్నప్పుడే అనుకున్నాను ఆఫీసులో ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు వరకు పని చేసే ఉద్యోగం చేయకూడదని’ అంది పూజ.

నావెల్ ఆర్కిటెక్చర్ చదివి...

సముద్రయాన రంగంలో పని చేయాలనుకున్నది పూజ. కొచ్చిలో నావెల్ ఆర్కిటెక్చర్‌ను 2020లో పూర్తి చేసింది. ఆ తర్వాత ఒక మెరైన్ కంపెనీలో ట్రయినీ నావెల్ ఆర్కిటెక్ట్‌గా చేరింది కాని ఆ పని రుచించలేదు. సముద్రపుగాలి తగలాలి అనుకుంది. ఆ సమయంలోనే తండ్రి స్నేహితుడొకడు షిప్ సర్వేయర్ ఉద్యోగం గురించి తెలిపాడు. అయితే ఆ రంగంలో స్త్రీలు ఇప్పటి దాకా లేరు. ‘నువ్వు మొదటిదానివి ఎందుకు కాకూడదు’ అన్నాడు తండ్రి. ఆ ప్రోత్సాహంతో లాయెడ్స్ రిజిస్టర్‌లో షిప్ సర్వేయర్‌గా ఉద్యోగం సంపాదించింది పూజ.

రెండేళ్ల శిక్షణ

షిప్ సర్వేయర్ మానసిక బలం, శారీరక సామర్థ్యం అవసరమయ్యే ఉద్యోగం. నౌక తయారవుతున్నప్పటి నుంచి సముద్రం మీదకు చేరే వరకూ చేరాక కూడా అన్ని నిర్మాణ, సాంకేతిక విభాగాలూ నిర్ణీత ప్రమాణాలు పాటిస్తున్నాయా లేదా చూడటమే ఈ ఉద్యోగం. నేల మీదా, సముద్రం మీదా పని ఉంటుంది. ఇందుకు కఠినమైన శిక్షణ అవసరం. లాయెడ్స్ రిజిస్టర్ సంస్థ ఆమెకు రెండేళ్ల శిక్షణ ఇచ్చింది. నౌకను తయారు చేసే మెటీరియల్ సర్వే శిక్షణ ముంబైలో తీసుకుంటే తయారీ విధానం సర్వే శిక్షణ కొచ్చిలో, గోవాలో తీసుకుంది. టెక్నికల్ శిక్షణ అంతా వైజాగ్, సింగపూర్‌లలో జరిగింది. రెండేళ్ల మొత్తం శిక్షణను సమర్థతతో పూర్తి చేయడం వల్ల ఇటీవల ఆమె షిప్ సర్వేయర్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకుంది.

పూజను చూసి మరెందరో యువతులు ఈ రంగంలోకి వస్తారు. ఏ రంగమూ మగవారి స్వీయసామ్రాజ్యం కాదని నిరూపిస్తారు.

సేవ

పది రూపాయలతో ప్రారంభం..



మనం ఒక్కరమే బాగుంటే సరిపోదు... మనతో పాటు మన చుట్టూ ఉన్నవారూ బాగుండాలి అనే ఆలోచన ఇండోర్‌వాసి కుక్కు ద్వివేదినిది. ఆపదలో ఉన్నవారికి చిన్న సాయమైనా చేయాలి అనే ఆశయంతో బ్యాంకు ఉద్యోగం చేస్తూ, కుటుంబ నిర్వహణను చూస్తూనే పేదలకు కావల్సిన మందులను ఉచితంగా పంపిణీ చేయాలనుకుంది. అందుకోసం 400 మంది సహోద్యోగుల జీతంలో ఒక్కొక్కరి నుంచి పదేసి రూపాయలను సేకరించి, ఆ మొత్తంతో ఉచిత మందుల పంపిణీని మొదలుపెట్టింది. పాతికేళ్లుగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. బ్యాంకు ఉద్యోగం నుంచి వీఆర్ఎస్ తీసుకొని గ్రామాలు తిరుగుతూ ఉచిత విద్య, వైద్యసేవలను అందిస్తూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది.

“నా బాల్యం అందమైన జ్ఞాపకాలతో గడిచింది. మా నాన్న డాక్టర్. నలుగురికి సాయం చేసే స్వభావం కావడంతో ఆయన సాయం కోసం, వైద్యం కోసం ఇంటికి ఎప్పుడూ అనేకమంది వస్తూ ఉండేవారు. వారి కోసం అమ్మ ప్రతిరోజూ వంట చేసి ఉంచేది. అది చూస్తూ పెరగడం వల్ల కాబోలు చిన్నప్పటి నుంచి ఎవరైనా సాయం అడిగితే కాదనే గుణం నాకు లేదు. ఇలా ఉచితంగా చేసే సాయాలను సామాజిక సేవ అంటారని కూడా తెలియకుండానే పదిమందికీ చేతనైన సాయం చేసేదాన్ని.

జీవించడానికి తక్కువ వస్తువులు చాలు

డిగ్రీ పూర్తవుతూనే తొలి ప్రయత్నంలోనే బ్యాంకు ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరినప్పటినుంచి ఇతరులకు నా అంతట నేనే సాయం చేయగలిగే అవకాశం వచ్చిందని సంతోషించాను. పెళ్లయ్యాక నా భర్త మద్దతు లభించింది. నా భర్త కూడా బ్యాంకు ఉద్యోగి. ఇద్దరి సంపాదన ఉన్నా మా ఇంట్లో తక్కువ వస్తువుల వినియోగం ఉండేది. నిరాడంబరంగా జీవించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. మా ఇంటి పరిసరాల్లోని అమ్మాయిల చదువుకు సాయం చేసేదాన్ని.

పేదలకు అందని వైద్యం

ఉద్యోగం చేస్తున్న రోజుల్లోనే నా కూతురు తీవ్ర అనారోగ్యానికి గురైంది. నా కుమార్తెకు చికిత్స జరుగుతున్నప్పుడు వైద్యం ఎంత ఖరీదైనదో తెలుసుకున్నాను. అంతటి ఖర్చు మేం ఎలాగో భరించగలిగాం. కానీ, రెండు పూటలా తిండికే నోచుకోని వారి సంగతేంటి? వారికి చికిత్స అవసరమైతే ఏం చేస్తారు? ఈ విషయం పదే పదే ఆలోచించేదాన్ని. ఒంటరిగా చేయడంలో పెద్ద సాయాన్ని అందివ్వలేనని గ్రహించాను. దీంతో నా సహోద్యోగుల సాయం తీసుకోవాలనుకున్నాను.

పది రూపాయలతో ప్రారంభం...

మా బ్యాంకు యూనియన్ లీడర్‌కు ఈ విషయాన్ని చెప్పాను. ‘మా అందరికీ మంచి జీతం ఉంది. పేద ప్రజల కోసం ఏదైనా సహాయం చేయాలి’ అని వివరించాను. దాదాపు ముప్పై ఏళ్ల క్రితం ఆలోచన ఇది. ప్రతి ఉద్యోగీ, తన జీతం నుంచి పది రూపాయలను ‘సేవ’ కోసం కేటాయించాలనే నిర్ణయం తీసుకున్నారు. అలా నెలకు నాలుగు వేల రూపాయలు జమ అయ్యేవి. పాతిక వేలు జమ కాగానే మా యూనియన్ లీడర్ ‘ఏం చేయాలో చెప్పమ’ని అడిగారు.

గంట సమయం సద్వినియోగం

అలా జమ అయిన డబ్బుతో పేద ప్రజలకు వైద్యం, విద్యలో సాయం చేయాలనే విషయాన్ని చెప్పాను. సేవా కార్యక్రమాలకు సమయాన్ని ఎలా కేటాయిస్తారు అని అడిగారు. ఎందుకంటే మాది ఉమ్మడి కుటుంబం. పిల్లల సంరక్షణ ఎలా సాధ్యమవుతుందని అడిగి, ఆఫీస్ టైమింగ్స్ నుండి గంట ఆలస్యంగా రావడానికి పర్మిషన్ ఇస్తామన్నారు. ఆఫీసు టైమ్‌కి ఇంటినుండి బయల్దేరి ఇండోర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడం, అక్కడ అన్ని డిపార్ట్‌మెంట్లు చూసి, ఎక్కడ సాయం అవసరం ఉందో చూసి, సేవా కార్యక్రమాలను మొదలుపెట్టాను. ఈ క్రమంలో జూనియర్ డాక్టర్లతో పరిచయాలు ఏర్పడ్డాయి. మెడికల్ కంపెనీ ప్రతినిధులు వచ్చినప్పుడు వారి దగ్గర నుంచి శాంపిల్స్ సేకరించడం కూడా మొదలైంది. ఏ మందు దేనికి వాడాలో వచ్చిన వారికి చెప్పి ఇవ్వడానికి, అక్కడే ఒక కాంపౌండర్‌ను కూడా నియమించాం.



హఠాత్పరిణామాలు

బ్యాంకు నిధులే కాకుండా విరాళం పేరుతో సాయం చేయడానికి కొంతమంది దాతలు ముందుకు వచ్చారు. పదేళ్ల పాటు ఈ విధమైన సేవాకార్యక్రమాలు బాగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో నా భర్త హఠాత్తుగా చనిపోయాడు. దీంతో నేను చాలా రోజులు డిస్టర్బ్ అయ్యాను. ఆ రోజుల్లో మా సహోద్యోగులు కూడా మరింత సాయం అందించడానికి ముందుకు వచ్చారు. దీంతో రిలీఫ్ సొసైటీగా పేరు మార్చాం. ఎందుకంటే ఇందులో బయటి వ్యక్తులు చేరడం మొదలుపెట్టారు. రూపాయ నుంచి లక్షల రూపాయల విలువైన మందులు వస్తున్నాయి.

పేదలకోసం పాఠశాల

జబ్బులు వచ్చి, చికిత్సలో ఉన్న రోగులకు మందులు ఇవ్వడం ద్వారా సాయం చేస్తున్నాం. కానీ, జబ్బులు రాకుండా అవగాహన కల్పించాలంటే చదువు ఉండాలనుకున్నాం. సరైన చదువు ఉంటే ముందస్తు జాగ్రత్తలు కూడా తీసుకోగలరు. ఈ ఆలోచనతో సైన్యంలో వైద్య సేవలు అందించే మా స్నేహితురాలు డాక్టర్ అనురాధతో కలిసి గిరిజన పిల్లలకు చదువులు చెప్పడం ప్రారంభించాం. ఇండోర్‌కు మూడు గంటల ప్రయాణం దూరంలో ఉన్న ఖర్గోన్‌లో సంస్థకు ధర్మకర్తగా ఉంటూ అనురాధతో పాటు కలిసి కార్యక్రమాలు నిర్వహించేదాన్ని. అక్కడే 12 ఎకరాల్లో పాఠశాల, హాస్టల్ కూడా నిర్మించాం. నా స్నేహితురాలి హఠాన్మరణంతో నేను బ్యాంకు ఉద్యోగం నుంచి వీఆర్ఎస్ తీసుకొని స్కూల్ బాధ్యతలు చూసుకోవడానికి వచ్చేశాను.

మొదట ఎనిమిది, పది మంది పిల్లలతో ప్రారంభించిన స్కూల్‌లో ఇప్పుడు 200 మంది పిల్లలు చదువుతున్నారు. వీరిలో 35 మంది వికలాంగులు. ఇప్పటికీ గ్రామంలో బాల్య వివాహాలు చేస్తుంటారు. దీంతో వారు చదువులు మానేసి వ్యవసాయం చేస్తుంటారు. పెద్దలకు అవగాహన కల్పించి, పిల్లలను స్కూల్‌కు తీసుకురావడం పెద్ద యుద్ధమే అవుతుంటుంది’ అంటూ తాము చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు ద్వివేదిని.

శీతల పంటలు




• కేయా సాలోత్



• ఉష్ణోగ్రతలు తగ్గించే పైకప్పు



• రాస్ప్ బెర్రీ



• బ్లూ బెర్రీ

మన నేలమీద పండిద్దాం

విదేశీయుల వ్యాపార రహస్యం, మార్కెట్ మాయాజాలం ఒకటి ఉంటుంది. ఒక ఉత్పత్తి మార్కెట్‌లోకి విడుదలయ్యే లోపు దాని గురించి ఒక సదభిప్రాయాన్ని కలిగించే ప్రచారం మొదలవుతుంది. ఆ ప్రమోషన్ ఆధారంగా సదరు ఉత్పత్తికి మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ పెరిగిపోతుంది. వాళ్ల బుట్టలో పడేవరకు మనకు ఆ మాయాజాలం అర్థం అయ్యేది కాదు. అర్థమయ్యే లోపు సదరు ఉత్పత్తిని వాడడానికి అలవాటు పడిపోయేవాళ్లం. ఆలా ఆయా ఉత్పత్తుల దిగుమతికి రహదారి పడుతుంటుంది. నిజానికి భారతదేశం నేల మీద పండని పంట ఉంటుందా అనుకుంది కేయా సాలోత్. అమెరికా, రష్యా, మెక్సికో, పోలండ్ దేశాల్లో పండే రాస్ప్‌బెర్రీ, బ్లాక్‌బెర్రీ, బ్లూ బెర్రీ, క్రాన్‌బెర్రీ... పంటలను మన నేల మీద పండించి చూపించాలనుకుంది. ఆ పంటలకు అనుగుణమైన ఉష్ణోగ్రతలను మెయింటెయిన్ చేసింది. మంచి దిగుబడిని సాధిస్తోంది.

హై బుష్ కౌన్సిల్ ప్రకటన!

“మన దేశం నుంచి ఇండియా దిగుమతి చేసుకున్న కూరగాయలు, పండ్ల విలువ ఏడాదికి ముప్పై శాతం చొప్పున తగ్గిపోతోంది. మనకిది ఏ మాత్రం అభిలషణీయమైన లావాదేవీ కానేరదు. ఇండియా మార్కెట్ అవసరాలను పెంచడానికి ప్రయత్నించడం వల్ల ప్రయోజనం కూడా ఉండదు. ఎందుకంటే ఇండియా తనంతట తానుగా ఈ పంటలను పండించుకుంటోంది. స్థానికంగా పండించుకోవడం వల్ల బయటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటే అయ్యే ఖర్చుతో పోలిస్తే చాలా తక్కువ ధరకు దొరుకుతున్నాయి” అని యూఎస్ హైబుష్ బ్లూ బెర్రీ కౌన్సిల్ ప్రతినిధి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ పంటలను పండించడంలో కేయా సాలోత్, ఆమె బాటలో మరికొంత మంది చిన్నరైతులు విజయవంతమైనట్లు చెప్పడానికి ఈ ప్రకటనే నిదర్శనం.

దిగుబడికి ముందే ఆర్డర్‌లు!

ఇంతకీ కేయాసాలోత్ అనతికాలంలోనే సక్సెస్ సాధించడానికి ఆమెకు వ్యవసాయ నేపథ్యం ఏ మాత్రం లేదు. ఆమె ముంబయిలో పుట్టి పెరిగింది. న్యాయశాస్త్రం చదివి లాయర్‌గా ప్రాక్టీస్ చేసింది. తన జ్ఞానాన్ని క్లయింట్‌లను కాపాడడం కోసం వినియోగించడం కంటే అంతకంటే మెరుగైన కారణం కోసం పని చేస్తే బావుణ్నని కోరుకుంది. అప్పుడు ఆమె దృష్టి మనదేశంలోకి అమెరికా, రష్యా, పోలండ్, మెక్సికో, సెర్బియా వంటి శీతల దేశాల నుంచి మనదేశానికి వస్తున్న రాస్ప్‌బెర్రీ, బ్లూ బెర్రీల మీద కేంద్రీకృతమైంది. మనం తినడానికి ఇష్టపడుతున్న పండ్లను మనం పండించుకోలేమా అని ప్రయోగం మొదలు పెట్టింది. ఇందుకోసం ఆమె మహారాష్ట్రలో ఏ ప్రదేశమైతే ఈ పంటలకు అనువుగా ఉంటుందోనని అధ్యయనం చేసింది. ఈ పంటలు పండే దేశాలకు వెళ్లి వారు అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించింది. తిరిగి ఇండియాకి వచ్చి ఇరవై ఎకరాల పొలంలో వ్యవసాయం మొదలుపెట్టింది. ఎండ, వర్షాలను తట్టుకునే విధంగా తెల్లటి పై కప్పుతో షెడ్ వేసింది. మొదటగా మైక్రోగ్రీన్స్‌తో మార్కెట్‌లోకి ప్రవేశించింది. కొత్తిమీర, మెంతి ఆకు వంటి స్వల్పకాల పంటలను రసాయన ఎరువులు లేకుండా పండించి రెస్టారెంట్‌లకు సప్లయ్ చేయడంతో అనతికాలంలోనే 50 మంది క్లయింట్‌లు వచ్చారు. రాబోయే కాలంలో తమ పొలం నుంచి ఫలానా పంటలు అందుబాటులోకి వస్తాయని క్లయింట్‌లకు సమాచారం ఇవ్వడంతో ఆమెకు అడ్వాన్స్ బుకింగ్‌లు మొదలయ్యాయి. ఈ పండ్లు దిగుబడి సాధించేలోపు ఆమె మార్కెట్ వేదికను ఏర్పాటు చేసుకుందన్నమాట. రైతులందరూ వ్యవసాయం చేస్తారు. పంట పండించి కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తారు. దళారుల చేతిలో మోసపోతుంటారు.

32 ఏళ్ల కేయా సాలోత్ అనుసరించిన సక్సెస్ ఫార్ములా రైతులకు మార్గదర్శనం.

ఇంటిప్



• వెడల్పాటి పాత్రలో నీటిని పోసి పూలు అలంకరించి ముందు గదిలో ఒక మూల పెట్టడం ఇంటీరియర్ డెకరేషన్‌లో భాగమైపోయింది. అలాగే ఈ కాలంలో ప్రతి గదిలో ఒక మూల చిన్న నీటి పాత్రను (మూత పెట్టకుండా) ఉంచితే గది ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.



యూత్ ప్లస్

నేడు వరల్డ్ హాపీనెస్ డే

లక్ష్యం ఉన్నచోట ఉత్సాహం... ఉత్సాహం ఉన్నచోట సంతోషం ఉంటాయి

సంతోషం సగం బలం అన్నారుగానీ నిజానికి అది సంపూర్ణ బలం. ఆ బలం ఉన్నచోటే ఆరోగ్యం ఉంటుంది. విజయం ఉంటుంది. డబ్బుతో కొనలేని ‘సంతోషం’ ఎవరూ చేరుకోలేని కీకారణ్యం కాదు. ‘నేను సంతోషంగా ఉండాలనుకుంటున్నాను’ అని మనసులో గట్టిగా అనుకొని ఒక అడుగు వేస్తే ఎన్నో దారులు కనిపిస్తాయి. సంతోష సామ్రాజ్యానికి దగ్గర చేస్తాయి. ‘సక్సెస్‌తో సంతోషం రాదు. సంతోషంతో సక్సెస్ వస్తుంది’ అనే పాతతరం మాటకు కొత్త తరం విలువ ఇస్తోందిప్పుడు. నిరంతరం సంతోషంగా ఉండడానికి ప్రయత్నిస్తోంది. సంతోషంగా ఉండడానికి సంబంధించిన టెక్నిక్స్ గురించి ఆసక్తిగా తెలుసుకుంటోంది...

భోపాల్‌కు చెందిన అనీష ప్రతి రెండు రోజులకు ఒక సంస్కృత శ్లోకాన్ని కంఠస్థం చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకొని ఈ ఏడాది జనవరి మొదటి తేదీ నుంచి ప్రారంభించింది. ఫిబ్రవరి నెల పూర్తయ్యే సరికి తాను అలవోకగా చెప్పగలిగే శ్లోకాల గురించి లెక్క వేసుకుంటే చెప్పలేనంత సంతోషం కలిగింది. ఆ సంతోషం ఇంకా కొనసాగుతూనే ఉంది.

తమిళనాడులోని వెల్లూరుకు చెందిన ఇంజినీరింగ్ స్టూడెంట్ ఐశ్వర్య మోహన్‌కు డ్రైవింగ్ అంటే చెప్పలేనంత భయం. ఆ భయాన్ని వదిలి ఈమధ్యే స్కూటీ నడపడం నేర్చుకుంది. తనకు ఇప్పుడు విమానం నడుపుతున్నంత సంతోషంగా ఉంది. ముంబైకి చెందిన సజన్ ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త గ్యాడ్జెట్స్ కొనడంలో అతడికి అంతులేనంత సంతోషం దొరుకుతుంది. ఇవి మాత్రమే కాదు...మనం చేసే పనికి ఇతరుల నుంచి లభించే ప్రశంస, అభిమాన హీరో సినిమాకు వెళ్లడం, ‘చాలా హ్యాండ్‌సమ్’గా ఉన్నావు’లాంటి కామెంట్... ఇలాంటివి అప్పటికప్పుడు లభించే తాత్కాలిక సంతోషాలే అయినా తక్కువ చేసి చూసేవి మాత్రం కాదు.

చిన్న చిన్న చినుకులు కలిస్తేనే కదా వర్షం.

ట్రై చేసి చూద్దాం

వ్యాయామాలతో సంతోషాన్ని సొంతం చేసుకునేవారు కొందరైతే, సంతోషం కోసం ప్రత్యేక వ్యాయామాలు చేసేవారు కొందరు. హ్యాపీనెస్‌ను సొంతం చేసుకోవడం కోసం చిన్నపాటి ఎక్సర్‌సైజ్‌ల మీద దృష్టి పెట్టే ధోరణి యువతరంలో పెరుగుతుంది. వాటిలో కొన్ని...

- టాప్ ఔట్ స్ట్రెస్ • న్యూ బిహేవియర్
- యాంకర్ హ్యాపీ అండ్ కామ్ ఫీలింగ్స్
- బ్రీత్ టెక్నిక్ • యాంగర్ రిలీజ్ సీక్రెట్.

నచ్చిన పనిలోనే సంతోషం

చెన్నైలో పుట్టి బెంగళూరులో పెరిగిన నిహారిక ఎన్ఎం ఇంజినీరింగ్ చదివే రోజుల్లో హాబీగా యూట్యూబ్ వీడియోలు చేసింది. ఈ ప్రక్రియ తనను ఒత్తిడికి దూరంగా ఉంచడంతో పాటు ఎప్పుడూ సంతోషంగా ఉండేలా చేసింది. ‘నచ్చిన పని చేయడంలో అపారమైన ఆనందం సొంతం అవుతుంది’ అంటున్న నిహారిక ఎన్ఎం ‘డిజిటల్ కంటెంట్ క్రియేటర్’గా ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకుంది.

హ్యాపీనెస్ ఫార్ములా

‘హ్యాపీనెస్’ అనే మాట వినిపించగానే గుర్తుకు వచ్చే పేర్లలో ఒకటి సైకాలజిస్ట్ మార్టిన్ సెలిగ్మాన్. అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన సెలిగ్మాన్ సంతోషం అంటే ఏమిటి? మనిషిని సంతోషంగా ఉంచే అంశాలు ఏమిటి? ఫెయిల్యూర్స్‌ను అధిగమించి విజయాలు సొంతం చేసుకున్న వ్యక్తుల గురించి లోతుగా అధ్యయనం చేశాడు. ‘అథెంటిక్ హ్యాపీనెస్’ పేరుతో పుస్తకం రాశాడు. ‘హ్యాపీనెస్’కు సంబంధించి **హెచ్ =ఎస్ +సి+వి** అనే ఫార్ములాను రూపొందించాడు.

హెచ్–హ్యాపీనెస్

ఎస్–సెట్ రేంజ్ : మన సంతోషంలో 50 శాతం పూర్తిగా మన నియంత్రణలో ఉండదు. జెనెటిక్ కెపాసిటీ ప్రభావం ఉంటుంది.

సి–సర్‌కమస్టాన్సెస్: దీర్ఘకాలిక సంతోషాన్ని సొంతం చేసుకోవడానికి పరిస్థితులను సరిదిద్దుకుంటూ, స్ట్రాటిజిక్ వర్క్‌తో ప్రయాణించాలి. ఉదా: నెగెటివ్ ఈవెంట్స్, నెగిటివ్ ఎమోషన్స్‌కు దూరంగా ఉండడం.

వి–వాలెంటరీ వేరియబుల్స్: హ్యాపీనెస్ ఫార్ములాలో బెస్ట్ అండ్ మోస్ట్ కంట్రోలబుల్ పార్ట్ ఇది. గత, వర్తమాన, భవిష్యత్తుకు సంబంధించిన పాజిటివ్ ఎమోషన్స్ ద్వారా సంతోషంగా ఉండడం.



హార్వర్డ్ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్, సోషల్ సైంటిస్ట్, రచయిత డా.ఆర్థర్ బ్రూక్స్ ‘హ్యాపీనెస్’కు సంబంధించి హెచ్=ఇ+ఎస్+ఎం అనే ఈక్వేషన్‌ను ప్రచారంలోకి తీసుకువచ్చాడు.

హాపీనెస్ (హెచ్) = ఎంజాయ్‌మెంట్ (ఇ)+శాటిస్ఫాక్షన్ (ఎస్)+మీనింగ్ (ఎం)

హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో ఆర్థర్ రూపొందించిన ‘మేనేజింగ్ హ్యాపీనెస్’ అనే కోర్సు అందుబాటులో ఉంది.



• నిహారిక

చిరు సంతోషాల కలయికే కదా ఆనందమయ జీవితం!

‘హాబీల నుంచి వచ్చే హ్యాపీనెస్ అంతా ఇంతా కాదయా’ అని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

జెన్ జెడ్‌కు సుపరిచితమైన పేరు... విష్ణు కౌశల్. ఇన్‌స్టాగ్రామ్‌లో కామిక్ కంటెంట్ జెనరేట్ చేయడం అతడి హాబీ. ఈ హాబీ కాస్త అతడిని డిజిటల్ స్టార్‌ను చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో విష్ణు కౌశల్‌కు 2.3 మిలియన్‌ల ఫాలోవర్‌లు ఉన్నారు. ‘పెద్ద లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని నా ప్రయాణాన్ని ప్రారంభించలేదు. నేను కామిక్ కంటెంట్‌ను క్రియేట్ చేయడానికి కారణం అది నన్ను ఎప్పుడూ సంతోషంగా ఉంచుతుంది’ అంటాడు 25 సంవత్సరాల విష్ణు కౌశల్.

‘లేదు అనుకుంటే ఏమీ లేదు. ఉంది అనుకుంటే ఎంతో ఉంది’ అనే ధోరణిని అనుసరించే యువతరం సూర్యోదయం నుంచి వెండి వెన్నెల వెలుగు వరకు ప్రతి ప్రకృతి అద్భుతాన్ని ఎంజాయ్ చేస్తోంది.

‘హ్యాపీనెస్ అనేది ఎమోషన్, ఫీలింగ్ కాదు. అదొక స్కిల్’ అంటున్న యువతరం రకరకాల టెక్నిక్‌లపై కూడా దృష్టి సారిస్తోంది. స్థూలంగా చెప్పాలంటే ‘సంతోషం’ అనే పునాదిని సిద్ధం చేసుకొని ‘లక్ష్యాలు’ అనే భవనాలపై దృష్టి పెడుతోంది.

సమ్మర్‌టిప్స్

- వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏసీలు ఉన్న ఇళ్లలో ఏసీ కండిషన్‌లో ఉందా లేదా అని చెక్ చేసుకోవడం, అవసరమైతే గ్యాస్ పట్టించడం వంటి జాగ్రత్తలు మొదలయ్యే ఉంటాయి. అయితే ఏసీ గురించి పట్టించుకునే ముందు ఇంటి కిటికీలకు వట్టివేరు తడికలను కర్టెన్‌లుగా వేయడానికి ప్రయత్నించండి. పర్యావరణహితంగా ఇంటిని చల్లబరుచుకుందాం.
- వేసవి రాగానే ఫ్రిజ్‌లో పెట్టే వాటర్ బాటిళ్ల మరో సెట్ కొని సిద్ధం చేయడం ఆనవాయితీ. ఫ్రిజ్ బాటిళ్లతోపాటు మట్టి కుండ కూడా కొని ఇంటికి తెచ్చుకోండి. మట్టి కుండలోని నీటి రుచి ఈ తరం బాల్యానికి పరిచయం చేయండి.